www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 12 జులై 2025
5
అన్నమయ్య



ఉద్యోగాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి- రాయచోటి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఒవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఖతర్‌లోని నిర్మాణ రంగంలో జిల్లా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి దాసరి నాగార్జున శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటిఐ చదివి టిఐజి, ఎఆర్‌సి మల్టీ వెల్డర్, టిఐజి, ఎఆర్‌సి, వెల్డర్ (సిఎస్) పనిలో 4 ఏళ్ల అనుభవం ఉండాలన్నారు. రెండేళ్ల కాంట్రాక్ట్ ఉద్యోగాల కోసం 24 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన పురుష అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. నెలకు రూ.1,800 నుంచి రూ.2,200 వరకు ఖతర్ రియాల్స్ (రూ. 52 వేల నుం చి రూ.62 వేల వరకు) జీతం ఉంటుందన్నారు. వీసా ప్రాసెసింగ్, విమాన టికెట్లు, వైద్య సదుపాయాలు, నివాసం వంటి ఏర్పాట్లను కంపెనీ యాజమాన్యం చెల్లిస్తుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 99888 53335ను సంప్రదించాలని కోరారు. అభ్యర్థులు ఈ నెల 31వ తేదీ లోపు www.naipunyam.apgov.inలో నమోదు చేసుకోవాలని కోరారు.

పేదింట ఉడకని కందిపప్పు

చౌకదుకాణాల్లో ఆగిన పంపిణీ

ఐదు నెలలుగా విడుదల కానివైనం

అందని ద్రాక్షలా కందిపప్పు

బయటి మార్కెట్‌లో రూ.150కి పైగా పలుకుతున్న ధర

చౌకదుకాణాల కందిపప్పుకు పెరిగిన డిమాండ్

సరకుల కోతతో కార్డుదారుల ఆక్రోశం

బహిరంగ మార్కెట్‌లో కంది ధరలకు రెక్కలొచ్చాయి. జిల్లాలోని రేషన్ కార్డుదారులకు ఈ నెలా కందిపప్పు అందని ద్రాక్షగానే మిగిలింది. పేదింట పప్పు ఉడకడం లేదు. తక్కువ ధరకే చౌక ధరల దుకాణాల్లో అందక కార్డుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు మార్కెట్లో కళ్లెం లేని గుర్రంలా పరుగులు తీస్తున్నా అదుపు చేసే వ్యవస్థ లేకపోవడంతో కలవరపడుతున్నారు. ఎందుకా ఈ పరుగు అనే ప్రశ్న సర్వత్రా వినిపిస్తున్నా పాలకుల్లో కాసింతైనా చనలం లేదు.

జిల్లాల్లో 1,123 రేషన్ షాపుల పరిధిలో 4,98,092 మంది తెల్లరేషన్ కార్డుదారులు ఉన్నారు. వీరందరికీ ప్రభుత్వం ప్రతి నెలా తెల్లరేషన్ కారుల్డపై బియ్యం ఉచితంగాను, అర కిలో పంచదార రూ.17, కిలో కందిప్పు రూ.70 చొప్పున సబ్సిడీపై పంపిణీ చేస్తున్న సంగతి తెలిసందే. ఇవన్నీ ప్రతి నెలా 1వ తేదీ నాటికే సివిల్ సప్లైరు గోడౌన్లకు చేరేవి. అక్కడి నుంచి ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారా గ్రామాలకు సరుకులు చేరేవి. ఇప్పటి వరకూ వ్యానుల ద్వారా ఇంటింటికీ సరఫరా చేస్తున్న విషయం విధితమే. రెండు నెలలుగా చౌకదుకాణాల వద్దకే ప్రజలు వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కంది పప్పు విషయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి నెలా కొంత శాతం కోత పెడుతోంది. మార్చి, ఏప్రిల్, మే, జూన్, జులై నెలలో పూర్తిగా కార్డుదారులకు కంది పప్పు సరఫరా కాలేదు. జిల్లాకు ఇప్పటికీ కంది పప్పు చేరలేదు. ఏకంగా కందిపప్పు విడుదల చేయకపోవడంతో పేద, నిరుపేదలు నెలలో ఒక్కపూట కూడా పప్పు అన్నం తినే పరిస్థితి లేదు. కిలో కందిపప్పు ధర బహిరంగ మార్కెట్‌లో రకాన్ని బట్టి రూ.150 నుంచి రూ.180 వరకు పలుకుతోంది. జిల్లా వ్యాప్తంగా మూడు నెలలుగా ఇవ్వలేదని కార్డుదారులు తెలుపుతున్నారు. దాదాపు అన్ని మండలాల్లోనూ ఈ నెల కందిపప్పు ఇవ్వలేదన్న విషయాన్ని కార్డుదారులంతా చెబుతున్నారు. సరుకులు సరిగా ఇవ్వడం లేదన్న ప్రజల వాదనకు తగ్గట్టుగానే రేషన్ సరుకులైన బియ్యం, పంచదార, కందిపప్పు పక్కదారి పడుతున్నాయి. జిల్లాలో ప్రతిరోజు ఏదో ఒక మండలంలో రేషన్ సరుకులు పట్టుబడుతున్నాయి. నెలవారి ఇచ్చే సరుకుల్లోనూ కందిపప్పు కోత పెట్టడంతో తెల్లరేషన్‌కార్డులు విలవిలాడిపోతున్నారు.



బయట దుకాణాల్లో కొనలేం

ప్రతి నెలా ప్రభుత్వం చౌక దుకాణాల్లో అందించే బియ్యం, చక్కెర, కందిపప్పు తీసుకుని కూరలు చేసుకుని తినేవాళ్లం. కందిపప్పు రేషన్ డీలర్లు ఇవ్వడం లేదు. ఎందుకు కందిపప్పు ఇవ్వడం లేదు అంటే ప్రభుత్వం సరఫరా చేయట్లేదు అంటున్నారు. వైసిపి ప్రభుత్వంలో కందిపప్పు రాక కొన్ని నెలలు ఇబ్బంది పడ్డాం. కూటమి ప్రభుత్వంలో కందిపప్పు సక్రమంగా అందిస్తుందని అనుకుంటే ఈ ప్రభుత్వం కూడా ఇవ్వడం లేదు. ప్రభుత్వం చౌకదుకాణాలకు కందిపప్పు సక్రమంగా అందించాలి.

- మాతంగి తిమ్మమ్మ, వీరబల్లి మండలం.

కందిపప్పు సక్రమంగా అందించాలి

ప్రభుత్వం రేషన్ దుకాణాలకు కందిపప్పు, సక్రమంగా అందించాలి. ఇంకా బియ్యం, చక్కెర, కందిపప్పుతో పాటు నిత్యావసర సరుకులు సబ్సిడీకి అందించాలి. ప్రయివేటు దుకాణాలలో నిత్యావసర సరుకులు కొనాలంటే ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. సూపర్ సిక్స్ పథకాలలో ప్రజలకు కావలసిన చాలా రకాలు నిత్యావసర సరుకులు రేషన్ దుకాణాల్లో అందించాలి. ప్రతి నెలా రేషన్ దుకాణాలకు కందిపప్పు అందించి ప్రజల కడుపు నింపాలి. ప్రభుత్వం గుర్తించి రేషన్ దుకాణాలకు నిత్యావసరుకులు అందించాలి.

- సురేంద్రరెడ్డి, వీరబల్లి మండలం.

ఐదు నెలలుగా ఇవ్వడం లేదు

ప్రభుత్వం పంపించేస్తున్నా రేషన్ బియ్యంతో పాటు గతంలో కంది బేడలు పంపిణీ చేసేవారు. ప్రస్తుతం కంది బేడలు ఇవ్వడం లేదు. ఐదు నెలలుగా కందిపప్పు ఇవ్వడం లేదు. జనవరి, ఫిబ్రవరిలో మాత్రం ఇచ్చారు. ఆ తర్వాత మార్చి నుంచి జులై వరకూ కందిపప్పు రాలేదని రేషన్ విక్రయించే సిబ్బంది చెబుతున్నారు. పప్పు ధర కూడా పెరిగిపోయింది. రూ.180 పెట్టి కొనుక్కునే పరిస్థితి మాకు లేదు. మాలాంటివారు కందిపప్పు కూడా తినలేని పరిస్థితి ఏర్పడింది. కందిపప్పు ప్రభుత్వం ప్రతినెల రేషన్ సరుకులను పంపిణీ చేపట్టాలి.

- వెంకటసుబ్బమ్మ, కూలీ, వీరబల్లి.



సేవా మంజరి అవార్డు అందుకుంటున్న డాక్టర్ రాధామణి

డాక్టర్ రాధామణికి సేవా మంజరి అవార్డు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లెకు చెందిన అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) సభ్యులు డాక్టర్ నాగపట్ల రాధామణిబాషాకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భాష సాంస్కృతిక శాఖ అమరావతి వారి సౌజన్యంతో ఆదివారం (సిపి బ్రౌన్ స్మారక జిల్లా గ్రంథాలయం పరిశోధనా సంస్థ యోగి వేమన విశ్వవిద్యాలయం కడప) సిఇఒ డాక్టర్ యు.వి.రత్నం ఆధ్వర్యంలో సేవా మంజరి అవార్డు ప్రదానం చేశారు. మదనపల్లె పట్టణానికి చెందిన ఉత్తమ ఉపాధ్యాయురాలు డాక్టర్ నాగపట్ల రాధామణిబాషా దంపతులు చేసిన విశిష్ట సేవలకు సేవా మంజరి అవార్డును తమ సంస్థ అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. తన భర్త సయ్యద్ బాషా సహకారంతో సొంత నిధులు వెచ్చించి పాఠశాల అభివృద్ధి కోసం పాటుపడడంతో గుర్తించిన అంతర్జాతీయ సాంస్కృతిక అకాడమీ విశ్వవిద్యాలయం వారు తనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేసినట్లు రాధామణి చెప్పారు. భవిష్యత్తులోనూ సామాజిక కార్యక్రమాలను కొనసాగిస్తానని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కన్వీనర్ భాగ్యమ్మ మాట్లాడుతూ డాక్టర్ రాధామణిబాషా అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘంలో సభ్యురాలుగా ఉంటూ, మహిళా దినోత్సవంలో పాల్గొంటూ వివిధ కార్యక్రమాలకు సహాయ సహకారాలు అందిస్తుంటారని పేర్కొన్నారు. మే నెలలో జరిగే బాలల రంగం సమ్మర్ క్యాంపుకు పిల్లలను ఉత్తేజ పరచడం, వారికి సహాయ సహకారాలు అందజేస్తారని పేర్కొన్నారు.

కుటుంబ ఆరోగ్యమే దేశ సౌభాగ్యం : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కుటుంబ ఆరోగ్యమే దేశ సౌభాగ్యమని డిఎంహెచ్ఒ డాక్టర్ లక్ష్మీనరసయ్య అన్నారు. శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసు పత్రి నుంచి బస్టాండు రోడ్డు ద్వారా బంగ్లా సర్కిల్ వరకు ప్లకార్డు చేత పట్టి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జులై11న ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించుకుంటామని తెలిపారు. ప్రాణాళిక బద్ధమైన మాతృత్వం కోసం గర్భధారణ మధ్య ఆరోగ్యకరమైన సమయం అనే నినాదాలతో అవగాహన కల్పించారు. తల్లి కావడానికి సరైన వయసు 18 సంవత్సరాల అని, పురుషుని వయసు 21 సంవత్సరాలని నిర్దేశం చినట్లు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన తర్వాత శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడు మాత్రమే గర్భధారణకు అను కూలమన్నారు. తల్లి శిశువు శ్రేయస్సు కోసం సరైన సమయంలో గర్భ ధారణ, బిడ్డకు బిడ్డకు మధ్య కొంత సమయం వెచ్చించాలని తెలి పారు. ఆరోగ్యకరమైన జీవితం కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వ హించాలని సిబ్బందిని ఆదేశించారు. టిఎఫ్ఆర్ రేటును పెంచే విధంగా అర్హులైన దంపతులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని తెలిపారు. కార్య క్రమంలో పిహెచ్‌సి ఇన్‌ఛార్జి బలరామరాజు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ అధికారి మహమ్మద్ రఫీ, ఆర్ఎంఒ కిరణ్, డిపిఎంఒ రియాజ్ బేగ్, డిఎస్ఎంఒ విష్ణువర్ధన్‌రెడ్డి, యుపిహెచ్‌సి వైద్యులు ఓబుల్‌రెడ్డి, కరీముల్లా, రాజగోపాల్, పర్యవేక్షకులు శ్రీనివాసులు, వెంకటేశ్వర రెడ్డి, ఎఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ లక్ష్మీ నరసయ్య

ప్రభుత్వం దృష్టికి ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు

- ఎపిపిటిడి ఇయు గౌరవాధ్యక్షులు నాగూర్‌వలి



నాగూర్ వలి సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆర్‌టిసి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి తనవంతు కృషి చేస్తానని ఎపిపిటిడి మదనపల్లె 1, 2 డిపోల ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు నాగూర్ వలి అన్నారు. ఎపిపిటిడి మదనపల్లె 1, 2 డిపోల ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులుగా నాగూర్ వలి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎపిపిటిడి ఎంప్లాయిస్ యూనియన్ 74వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆర్‌టిసి బస్టాండ్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌టిసి కార్మికుల న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని పేర్కొన్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి అటు ఆర్‌టిసి అభివృద్ధికి, ఇటు తెలుగుదేశం పార్టీకి మంచిపేరు తీసుకొస్తానని స్పష్టం చేశారు. తనను ఎపిపిటిడి మదనపల్లి 1, 2 డిపోల గౌరవ అధ్యక్షులుగా ఎన్నుకున్న యూనియన్ రాష్ట్ర నాయకులు, స్థానిక యూనియన్ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎంతో ఘనమైన చరిత్ర కలిగిన ఎపిఎస్ఆర్‌టిసి ఇయు మదనపల్లి 1, 2 డిపోల గౌరవ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడం గర్వంగా ఉందన్నారు. తాను ఈ పదవి చేపట్టాలనే ప్రతిపాదన వచ్చినప్పుడు ఎంప్లాయీస్ యూనియన్ చరిత్ర పుస్తకాన్ని చదివానన్నారు. తమ హక్కుల కోసం కార్మికులు ఉరి కంబాలను సైతం ఎక్కడానికి వెనుకాడలేదని, అటువంటి చరిత్ర కలిగిన యూనియన్‌లో తాను భాగస్వామిని కావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆశీస్సులు, స్థానిక టిడిపి నాయకులు, ఎంప్లాయీస్ యూనియన్ నాయకుల, సహాయ సహకారాలతో ఈ బాధ్యతలు చేపట్టానన్నారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదర్‌రావు, జి.వి.నరసయ్య మాట్లాడుతూ బలమైన నాయకత్వం ఉంటే యూనియన్ బలపడుతుందని, కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. అనంతరం నాగూర్ వలిని శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్.వి కుమార్, రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు పఠాన్ ఖాదర్‌ఖాన్, టిడిపి నాయకులు గంగారపు రామ్మూర్తి నాయుడు, బొమ్మిశెట్టి పురుషోత్తం, తమ్మిశెట్టి రామకృష్ణ, సూదిళ్ల సుధాకర్, ప్రవీణ్ రాయల్, దేవరింటి ప్రసాద్, బీబీ సైదు, పోతపోలు వెంకటేష్, సిబిఎన్ రెడ్డి శేఖర్, బావాజాన్, శివకృష్ణ పాల్గొన్నారు.

'అన్నమయ్య'కు ఆమోదం లభించేనా?

- నేడు సిడబ్ల్యుసి, డిజైనింగ్ నిపుణుల పరిశీలన

- త్వరలో తుది నివేదిక అందజేత



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణకు కసరత్తు తుదిదశకు చేరుకోనుంది. దేశంలోనే అత్యున్నత నీటిపారుదలశాఖ నిపుణుల బృందమైన సెంట్రల్ ప్లానింగ్ కమిషన్, డ్యామ్ డిజైన్ ఎక్స్‌పర్ట్ కమిటీకి చెందిన ఆరుగురు నిపుణుల బృందం శని, ఆదివారం అన్నమయ్య రిజర్వాయర్‌ను సందర్శించనుంది. అన్నమయ్య రిజర్వాయర్ ఇంజినీరింగ్ యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. 2021 నవంబర్ 19, 20 తేదీల్లో జవాద్ తుఫాన్ ధాటికి అన్నమయ్య రిజర్వాయర్ మట్టికట్ట పూర్తిగా తెగిపోవడంతో నామరూపాలు లేకుండా పోయిన సంగతి తెలిసిందే. ఇందులో డ్యామ్ కట తెగిన ప్రాంతంలోనే డ్యామ్‌ను పునరుద్ధరిం చాలా, తెగిన కట్టకు సమీపంలో రెండు చోట్ల పడిన గండ్లను ఎలా పూడ్చాలి, మూడు టిఎంసిల నిల్వ స్థానంలో ఎనిమిది టిఎంసిల నిల్వ చేయాలా లేదా, కాంక్రీట్ డ్యామ్ నిర్మాణమా, లేక మట్టి కట్టలతోనే నిర్మించాలా, మట్టి కట్టల నిర్మాణం చేపడితే డ్యామ్ పటిష్టత ఎలా ఉంటుందనే పలు అంశాలను కూలకషంగా అధ్యయనం చేయనున్నట్లు తెలుస్తోంది. అనంతరం పూర్తిస్థాయిలో సర్వే చేసిన అనంతరం ప్రభుత్వానికి తుది నివేదిక అందజేయనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రప్రభుత్వం ఇంజినీరింగ్ నిపుణుల తుది నివేదిక ఆధారంగా అన్నమయ్య రిజార్వయర్ పునరుద్ధరణకు సంబంధించిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే 2021 నుంచి జిల్లా నీటిపారుదలశాఖ, విజయవాడకు చెందిన హైడ్రాలజీ, డిజైనింగ్, ఇతర ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించిన ఇంజినీరింగ్ నిపుణులు, ఉన్నతాధికారులు పలు మార్లు పరిశీలించిన సంగతి తెలిసిందే. అనేక వడపోతల ఓ ప్రయివేటు ఏజెన్సీ సహాయంతో ప్రతిపాదనలను సైతం తయారు చేయించారు. అనంతరం జిల్లా నీటి పారుదలశాఖ రూపొందించిన రూ.787.77 కోట్ల ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం రివర్స్‌టెండరింగ్ ప్రక్రియను సైతం పూర్తి చేసి జిఒ ఆర్‌టి -2076ను జారీ చేసింది. అన్నమయ్య రిజర్వాయర్‌ను కాంక్రీట్‌తో నిర్మించడంతోపాటు 10 గేట్ల ద్వారా ఐదు లక్షల నుంచి ఎనిమిది లక్షల క్యూసెక్కుల వరద డిశ్చార్జి సామర్థ్యంతో నిర్మించనున్నట్లు తెలిపింది. ఇంతలో 2024 సార్వత్రిక ఎన్నికలు రావడంతో వ్యవహారం మొదటికి వచ్చి ంది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు మరోసారి సిడబ్ల్యుసి, డ్యామ్ డిజైనింగ్ తది తర ఆరుగురు నిపుణులతో సర్వే చేయించిన అనంతరం అందిన నివేదిక ఆధారంగా అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణ పనులు చేపట్టే అవకాశం ఉందనే వాదన ఇంజినీరింగ్ వర్గాల నుంచి వినిపిస్తోంది.

వైభవంగా సౌమ్యనాథ స్వామి కల్యాణం



సౌమ్యనాథుని కల్యాణంలో మాంగల్యం చూపుతున్న ఆగమశాస్త్ర పండితులు

ప్రజాశక్తి-నందలూరు

శ్రీ సౌమ్యనాథుని కల్యాణ మహోత్సవం శుక్రవారం ఉదయం అంగరంగ వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత సౌమ్యనాథ స్వామి కల్యాణం చూడముచ్చటగా సాగింది. కల్యాణ వేడుకలను తిలకించేందుకు భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ ప్రాంగణంలో వివిధ రకాల పుష్పాలతో కల్యాణ వేదికను అలంకరించారు. పాంచరాత్ర ఆగమ పండితులు రఘునందన్, పవన్ కుమార్, మనోజ్ కుమార్, సునీల్ కుమార్, సాయి స్వామి శ్రీదేవి, భూదేవి సమేత సౌమ్యనాథ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణ వేడుకలకు ఉత్సవమూర్తులను ముస్తాబు చేసి మేళతాళాల మధ్య కళ్యాణ వేదికపైన ఆశీనులు గావించారు. పండితుల మంత్రోచ్చారణలు, వ్యాఖ్యానంతో భక్తులు గోవింద నామస్మరణలతో ఆలయం భక్తి పారవశ్యంతో నిండిపోయింది. ఉదయం కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. వేద పండితులు, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో మాంగల్యధారణ, ముత్యాల తలంబ్రాలు క్రతువులను నిర్వహించారు. రాజంపేట టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్మోహన్‌రాజు, రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయ శేఖర్‌రెడ్డి పట్టు వస్త్రాలను ఆలయ అర్చకులకు అందజేశారు. వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

కల్యాణానికి హాజరైన ప్రముఖులు: సౌమ్యనాథుని కళ్యాణ మహోత్సవానికి ఆర్‌టిసి మాజీ రీజినల్ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు, జనసేన నాయకులు ఎల్లటూరి శ్రీనివాసరాజు, సమ్మెట శివప్రసాద్, రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎద్దుల విజయ సాగర్ హాజరయ్యారు.

భక్తులకు అన్నదానం : కల్యాణ మహోత్సవానికి వచ్చిన భక్తులకు ప్రముఖ పారిశ్రామికవేత్త సోముల రాజు చంద్రశేఖర్‌రాజు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్యాణ మహోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రాజంపేట రూరల్ సిఐ బి.వి.రమణ ఆధ్వర్యంలో ఎస్ఐ మల్లికార్జునరెడ్డి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. స్వర్ణాంధ్ర సంస్థ అధ్యక్షుడు వేపగుంట శ్యామాజ్ ఆధ్వర్యంలో స్కౌట్ సభ్యులు భక్తులకు సేవలు అందించారు. కల్యాణ మహోత్సవం అనంతరం శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథ స్వామిని ఆలయం చుట్టూ పల్లకీలో ఊరేగించి అనంతరం మాడవీధుల్లో భక్తులకు శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథుడు దర్శనమిచ్చారు.

గజవాహనంపై దర్శనమిచ్చిన సౌమ్యనాథుడు :శ్రీసౌమ్యనాథ స్వామి రాత్రి గజ వాహనంపై మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు కాయ కర్పూరం సమర్పించి తమ మొక్కలను తీర్చుకున్నారు.

భక్తులకు ఉచిత ఆటో సర్వీస్: సౌమ్యనాథ స్వామి కల్యాణానికి వచ్చే భక్తుల సౌకర్యం కోసం జనసేన నాయకులు అతికారి కృష్ణ సహకారంతో నందలూరు జనసేన నాయకులు అరుణ్ పాండే, శివ, మండెం రాము ఆధ్వర్యంలో ఉచిత ఆటో సౌకర్యం కల్పించారు.

బ్రహ్మోత్సవాలలో నేడు: బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం ఉదయం వైభవంగా రథోత్సవం నిర్వహించేందుకు టిటిడి అధికారులు ఏర్పాట్లు చేశారు. రథంపై శ్రీదేవి భూదేవి సమేత సౌమ్య నాథుడు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

రెవెన్యూ సమస్యలను త్వరగా పరిష్కరించాలి

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి- రాయచోటి

ప్రజలకు సంబంధించిన రెవెన్యూ సమస్యలను త్వరగా పరిష్కరించాలని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ఆర్‌డిఒ మధుసూదన్‌రావు, ఎంపిడిఒ సురేష్ బాబుతో ప్రజలు సమర్పించే రెవెన్యూ సమస్యలను పరిష్కరించి, యువత ఉద్యోగాల కల్పనకు కృషి చేయాలని కోరారు. రెవెన్యూ సమస్యలకు తక్షణమే పరిష్కార మార్గాలను సూచించారు. మున్సిపల్ అధికారులు డిఇ విజయ్ కుమార్, ఎఇ కృతి, రమణారెడ్డి మర్యాదపూర్వకంగా మంత్రిని కలిశారు. రాయచోటి మున్సిపాలిటీలోని సమస్యలకు తక్షణమే పరిష్కార మార్గాలను చూడాలని సూచించారు. సకాలంలో మున్సిపల్ కార్మికులు నీటి సరాపర, చెత్త సేకరణ వంటి పనులు చేపట్టి ప్రజలకు ఇబ్బంది కల్గకుండా చూడాలని మంత్రి వారికి సూచించారు. ప్రభుత్వం అందించే పథకాలను పేదలందరూ సద్వినియోగం చేసుకొని ఆర్థిక అభివృద్ధి చెందాలన్నారు.



ఆర్‌డిఒతో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజలు సంతృప్తి చెందేలా వైద్య సేవలు : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజలు సంతృప్తి చెందేలా వైద్య సేవలు అందించాలని, వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందితో హెల్త్ పారామీటర్స్, వర్షాకాలంలో వ్యాప్తి చెందే వ్యాధులు, ప్రజల నుండి సేకరించిన అభిప్రాయాలు, తదితర అంశాలపై, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష తదితరులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం డయాబెటిస్, హైపర్ టెన్షన్, మేటర్నల్ హెల్త్, నియోనేటల్ హెల్త్, అభ ఐడి మ్యాపింగ్, తదితర అంశాలలో అన్ని పిహెచ్సిలు నిర్దేశించిన లక్ష్యాల మేరకు పనిచేయాలని పేర్కొన్నారు. వర్షాకాలంలో వ్యాప్తి చెందే వ్యాధులపై దృష్టి సారించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది పని తీరు, రక్త పరీక్షలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేస్తున్నారా లేదా, సిబ్బంది స్నేహపూర్వకంగా మెలిగారా లేదా వంటి అంశాలపై ప్రజల నుండి అభిప్రాయాలను సేకరిస్తుందని పేర్కొన్నారు. మెడికల్ ఆఫీసర్లు ప్రజలతో మానవతా దృక్పథంతో మెలగాలని తెలిపారు. తమ సిబ్బందికి కౌన్సెలింగ్ చేసి సిబ్బంది ప్రజలతో స్నేహపూర్వకంగా మెలిగేలా చూడాలని తెలిపారు. ప్రజల నుండి సిబ్బంది యొక్క ప్రవర్తనపై అభిప్రాయాలను సేకరించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొన్ని ప్రాథమిక ఆరోగ్యం కేంద్రాల్లో మెడికల్ అధికారులు ప్రజలతో మంచి ప్రవర్తనతో మెలిగినప్పటికీ కింది స్థాయి సిబ్బంది ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగడం లేదని వారు తమ ప్రవర్తనను మార్చుకొని ప్రజలతో సఖ్యతగా మెలగాలని పేర్కొన్నారు. వైద్య సేవలు మిగిలిన సేవలు కంటే ప్రజలకు అత్యవసరమని చాలా ఉన్నతమైన సేవ అని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడం ద్వారా మంచి గుర్తింపు వస్తుందన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేసి జిల్లాలో ఉన్న అన్ని పీహెచ్సీలను సందర్శించేలా చూడాలని పేర్కొన్నారు. మెడికల్ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్యాశాఖాధికారి డాక్టర్ లక్ష్మీ నరసయ్య, డిపిఎంఒ డాక్టర్ రియాజ్ బేగ్, ప్రోగ్రామ్ అధికారి ఆర్‌బిఎస్ కె.డాక్టర్ విష్ణు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పశువులకు టీకా వేస్తున్న వెంకటమునినాయుడు

చర్మవ్యాధి టీకాలతోనే నయం

ప్రజాశక్తి-కలికిరి

ముద్ద చర్మవ్యాధికి టీకాలతో నయం చేయవచ్చునని పశువైద్య సహాయ సంచాలకులు వెంకట మునినాయుడు తెలిపారు. మండల పరిధిలోని గుట్ట పాలెం గ్రామం, సి.బలినేపల్లి గ్రామంలో ముద్దచర్మవ్యాధి టీకాలు కార్యక్ర మాన్ని ఆయన ప్రారంభించారు. ఇటీవల కాలంలో పశువులు ఈ వ్యాధి బారిన పడుతున్నాయని, ఎక్కువగా దూడ లలో వ్యాపిస్తుందని అన్నారు. ఈ వ్యాధి నుంచి పశువులను రక్షించాలంటే టీకాలు వేసుకోవడమే సరియైన మార్గమని సూచించారు. ఈనెల 11 నుంచి 31 వరకు జరుగుతుందని రైతులందరూ మూడు నెలల వయసు పై బడిన దూడల నుంచి ప్రతి పశువుకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని తెలిపారు. పశు వైద్య సిబ్బంది ప్రతి గ్రామాని కివచ్చి టీకా లు వేస్తారని, తప్పనిసరిగా రైతులు ఈ సదవకాశాన్ని వినియో గించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పాలెం పశు వైద్య శస్త్ర చికిత్స కులు డాక్టర్ జగన్మోహన్‌రెడ్డి, జెవిఒ ఆనంద, గోపాలమిత్ర లతీష్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వైస్ ఎంపిపికి 'గడికోట' పరామర్శ

ప్రజాశక్తి-రామాపురం

గుండెకు శస్త్ర చికిత్స చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి పొందు తున్న వైస్ ఎంపిపి రవిశంకర్ రెడ్డిని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించారు. రవిశం కర్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని శ్రీకాంత్‌రెడ్డి ఆయన ఇంటికి వెళ్లి పరామ ర్శించారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ గడికోట జనార్ధన్‌రెడ్డి, లక్కిరెడ్డిపల్లి ఎం పిపి మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు పెద్దిరెడ్డి ఆదినారాయణ రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఉచితంగా హిందీ మెటీరియల్ అందిస్తున్న హుసేన్

ఉచిత స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని టి.కమ్మపల్లె జడ్‌పి హైస్కూల్‌లో శుక్రవారం పదవ తరగతి విద్యార్థులకు హిందీ స్టడీ మెటీరియల్‌ను హిందీ ఉపాధ్యాయుడు సయ్యద్ సర్దార్ హుస్సేన్ ఉచితంగా అందించారు. పాఠశాల ప్రధానో పాధ్యా యుడు సయ్యద్ సిబ్తుల్లా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి భవిష్యత్తు లక్ష్యాన్ని నిర్దేశం చుకొని చదవాలన్నారు. లక్ష్యం లేకుండా చదవడం రెక్కలు లేని పక్షి ఎగరాలి అని అనుకోవడం లాంటిదేనని అన్నారు. కష్టంగా కాకుండా ఇష్టంగా చదివితేనే విజ యం సాధిస్తారని ఆయన తెలిపారు. రాబోయే పబ్లిక్ పరీక్షల్లో 90 పైగా మార్కులు సాధించడానికి ఉపయోగపడేవే స్టడీ మెటీరియల్ అందజేసిన సర్దార్ హుస్సేన్‌ను ఆయన అభినందించారు.కార్యక్రమంలో ఆంగ్ల ఉపాధ్యా యుడు బాల నరసింహులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెర్లోపల్లి సర్పంచ్ మృతి

ప్రజాశక్తి-చిట్వేలి

మండల పరిధిలోని చెర్లోపల్లి గ్రామ సర్పంచ్ వైసిపి సీనియర్ నాయకుడు ఓబినేని ఈశ్వరయ్య గురువారం అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1983 వ సంవత్సరం నుండి రాజకీయ జీవి తం ప్రారంభించిన ఆయన సుదీర్ఘకాలం కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగా నిలబడ్డారని, అనం తరం దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి మరణానంతరం అతని కుమారుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వెంట నడిచి వైసిపి పార్టీ లో చేరి పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేశా రన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బాబుల్ రెడ్డి, మండల వైసిపి కన్వీనర్ చెవ్వు శ్రీనివాసరెడ్డి, బసిరెడ్డి రమణారెడ్డి, ప్రదీప్ రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సంఘ సభ్యులతో మాట్లాడుతున్న జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ ఆంజనేయులు

ప్రతి కుటుంబానికి బ్యాంకు ఖాతా ఉండాలి

ప్రజాశక్తి-వీరబల్లి

ప్రతి కుటుంబానికి బ్యాంక్ ఖాతా ఉండాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం సానిపాయి గ్రామ సమాఖ్య-1 జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 ఆగస్టు 15 నుంచి ప్రధాని నరేంద్ర మోడీ జనధన్ యోజన పథకానికి, గ్రామీణ ప్రాంతాల మహిళలు, చిన్నకారు రైతులు, కూలీలు అర్హులన్నారు. దీని ద్వారా ఒక లక్ష రూపాయల ప్రమాదబీమా ఉంటుందన్నారు. ప్రధాన మంత్రి జీవన జ్యోతిబీమా, సురక్షా భీమా ద్వారా రూ.4 లక్షల వరకు వర్తిస్తుందన్నారు. ఒక సంవత్సరానికి 18 నుంచి 50 సంవత్సరాల వయసుగల వారు రూ.436 ప్రీమియం, 18 నుంచి 70 సంవత్సరాలకు రూ .20 ప్రీమియం చెల్లించాలన్నారు. అటల్ పెన్షన్ యోజన ద్వారా 60 సంవత్సరాల వరకు పొదుపు చేసుకొంటే రూ.1000 నుండి రూ.5000 పెన్షన్ పొందవచ్చు అన్నారు. సుకన్య సమృద్ధి పథకం ద్వారా కుటుంబంలోని రూ.10 సంవత్సరాల ఆడపిల్లలకు 14 సంవత్సరాల వరకు ప్రీమియం చెల్లిస్తే 18 సంవత్సరాల వయసు నాటికి లబ్ధిదారు చెల్లించిన మొత్తానికి మూడు రెట్లు అధిక మొత్తం వస్తుందన్నారు. ఎపిఎం మాట్లాడుతూ బ్యాంక్ పథకాలు సంఘ సభ్యులు అందరూ ఉపయోగించుకోవాలన్నారు. సంఘాలను సక్రమంగా నడిపించు కొన్నప్పుడే ప్రభుత్వ పథకాలు పొందవచ్చున్నారు. వార్షిక నివేదిక సభ్యులకు తెలియజేసి, నూతన పదాధికారులను ఎంపిక చేసుకున్నారు. సమాఖ్య అధ్యక్షురాలిగా రెడ్డెమ్మ, కార్యద ర్శిగా నాగజ్యోతి, కోశాధికారిగా నాగరత్న లను ఎన్నుకొన్నారు. కార్యక్రమంలో సిసి కృష్ణయ్య, స్థానిక బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, సి.ఎఫ్.యల్.కో-ఆర్డినేటర్ చంద్ర, విఒఎ రెడ్డెయ్య, సభ్యులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో వరుస చోరీలు

- భయాందోళనలో పట్టణ ప్రజలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలోని నందిశెట్టి వీధిలో వరుస చోరీలు జరుగుతున్నాయి. నెల రోజుల వ్యవధిలోనే నందిశెట్టి వీధిలో రెండు చోరీలు చోటు చేసుకున్నాయి. పట్టణంలో వరుసగా దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు భయాందో ళన కు గురవుతున్నారు. ఇప్పటికైనా పట్టణంలో జరుగుతున్న దొంగత నాలపై పోలీ సులు ప్రత్యేక నిఘా ఉంచాలని, రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలను మోసం చేయడమే చంద్రబాబు విజన్

వైసిపి జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి



మదనపల్లి : బాబుష్యూరిటీ-మోసం గ్యారెంటీ క్యూఆర్‌ను విడుదల చేస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ప్రజలను మోసం చేయడమే చంద్రబాబు విజన్ అని కూటమి ఏడాది పాలనలో రాష్ట్రానికి ఒరిగింది శూన్యమని వైసిపి జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి అధ్యక్షతన తంబళ్లపల్లె నియోజకవర్గం వైసిపి విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, జిల్లా పరిశీలకులు సురేష్‌బాబు, సీనియర్ నాయకులు సుగవాసి బాలసుబ్రమణ్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా అమరనాథ్‌రెడ్డి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల అమలు చేసి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా ,ప్రజలపై అదనపు భారం మోపుతోందని విమర్శించారు.అభివృద్ధి,సంక్షేమాన్ని గాలికొదిలేసి మాజీ సిఎం జగన్, వైసిపిని లక్ష్యంగా చేసుకొని విమర్శలు చేస్తున్నారన్నారు.కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు బైసాని చంద్రశేఖర్‌రెడ్డి, నియో జవర్గ మహిళా అధ్యక్షురాలు అనిత చక్రవర్తి, నియోజకవర్గం బూత్ కమిటీ అధ్యక్షుడు నేరెళ్ల రెడ్డి హరి, హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు కంచి బలరాం రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ ప్రదీప్‌రెడ్డి, పిటిఎం ఎంపిపి మహమ్మద్, జడ్‌పిటిసి ఉంగరాల శివన్న ,వైసిపి సీనియర్ నాయకుడు కంచి కోదండ, వైసిపి పట్టణ అధ్యక్షుడు సి.ఆర్ చిన్నికృష్ణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం : 'గడికోట'

రామాపురం : కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు తెలియజేయాలని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రం రామాపురంలో మండల కన్వీనర్ గడికోట జనార్ధనరెడ్డి అధ్యక్షతన వైసిపి మండల విస్తృత స్థాయి సమావేశానికి నిర్వహించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే హిందూపురం వైసిపి పరిశీలకులు రమేష్‌కుమార్‌రెడ్డి, మండలంలోని కమిటీలు, అనుబంధ విభాగాలు, సర్పం చ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను అమ లు చేయకుండా చంద్రబాబు నయ వంచన చేస్తున్నారని మండి పడ్డారు. ఓట్లు వేయించుకుని అవసరం తీరాక హామీ లను గాలికి వదిలేశా రన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టు బడి సాయం ఇంతవరకూ అందలేదన్నారు. బిసిలకు 50 ఏళ్లకే పింఛన్ అంది స్తామని చెప్పి ఇవ్వకుండా మోసం చేశారన్నారు. జాబ్ కేలండర్ విడుదల చేయ కుండా, ఉద్యోగాలు కల్పించకుండా, నిరుద్యోగ భృతి చెల్లింకుండా యువతను దగా చేశారన్నారు. 18 ఏళ్లు నిండి 59 ఏళ్ల వయసు వరకు మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని ఏడాది దాటినా ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. విద్యుత్ బిల్లులను పెంచారన్నారు. వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో పేరిట ఒక వినూత్న ప్రచార కార్యక్రమాన్ని ప్రకటిం చారన్నారు. బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్య్ర కమాన్ని గ్రామ నాయ కులు, కార్యకర్తలతో కలిసి మండల నాయకులు ప్రచారం చేయాలన్నారు. కార్యక్ర మంలో జడ్‌పిటిసి మాసన వెంకటరమణ, మాజీ ఎంపిపి ప్రభాకర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు పెద్దిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, వైస్ ఎంపిపి బాబు, సర్పం చ్‌లు అయోధ్యాపురం నాగభూషన్‌రెడ్డి, వెంకట రెడ్డి, ఆయూబ్ పాల్గొన్నారు.

పీలేరు :ముఖ్యమంత్రి చంద్రబాబు మాటలు అబద్దాల మూటలని మరోసారి రుజువైందని వైసిపి జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమరనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. స్థానిక ఎంఎం కల్యాణ మండపంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ అన్న అంశంపై వైసిపి నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తైనా రాష్ట్రంలో ఏ ఒక్క పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు నిండా మునిగిపోయారని తెలిపారు. మామిడి రైతుల పరిస్థితి మరీ దారుణంగా తయారైందని, గత ప్రభుత్వంలో రూ.16 నుంచి రూ.18 వరకు గిట్టుబాటు ధర కల్పించడం జరిగిందని, ప్రస్తుతం చూస్తే కిలో కేవలం రూ.2కు కూడా కొనేవారు లేక కాయలు మొత్తం తోటల్లోనే వదిలి రైతులు పూర్తిగా నష్టపో యారని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు అనీషారెడ్డి, మైనారిటీ కమీషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్‌అహ్మద్, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నరసింహారెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు, నాయకులు సుగవాసి సుబ్రమణ్యం, హరీష్ రెడ్డి, హరిప్రసాదొడ్డి, ఆగా మోహిద్దీన్, కన్వీనర్లు దండు జగన్మోహన్రెడ్డి, రమేష్ రెడ్డి పాల్గొన్నారు.**మదనపల్లె అర్బన్ :** వైసిపి మదనపల్లె నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిస్సార్ అహమ్మద్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి,తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకానాథ్ రెడ్డి, సుగవాసి సుబ్రహ్మణ్యం,మాజీ ఎమ్మెల్యే తిప్పారెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే, కడప మేయర్ సురేశ్ బాబు, రాష్ట్ర కార్యదర్శి అనీషా రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్, మనుజా రెడ్డి, ఎపి ఎండిసి మాజీ చైర్ పర్సన్ షమీమ్ అస్లాం హాజరయ్యారు. ఈ సందర్భంగా నిస్సార్ అహమ్మద్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయలేదు కానీ సుపరిపాలన తొలి అడుగు అంటూ ప్రజలను వంచించడానికి మళ్ళీ మీ ఇంటి వద్దకు వస్తున్నారని, జాగ్రత్త అంటూ హెచ్చరించారు.



రామాపురం : మాట్లాడుతున్న గడికోట శ్రీకాంత్‌రెడ్డి

పొన్నీటిపాళ్యం టిడిపి గ్రామ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం



ఏకగ్రీవంగా ఎన్నికైన సభ్యులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలోని పొన్నీటిపాళ్యం టిడిపి గ్రామ కమిటీ ఎన్నిక ఏకగ్రీమైంది. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆదేశాల మేరకు పార్టీ సీనియర్ నాయకుల సూచనలతో పరిశీలకులు నాగరాజ, రఘుపతి నాయుడు, నంద, జంగాల వెంకటరమణ, దేవరింటి శ్రీనివాసులు సమక్షంలో పొన్నిటీపాళ్యం రచ్చబండ వద్ద గ్రామ కమిటీ ఎన్నిక జరిగింది. గ్రామ కమిటీ అధ్యక్షుడుగా కె.కృష్ణప్ప, ప్రధాన కార్యదర్శిగా చెంద్రాయుడు, ఇతర కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పరిశీలకులు మాట్లాడుతూ టిడిపి కోసం కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలను గుర్తించి వారికి కమిటీలలో ప్రాధాన్యత కల్పించడం జరిగిందన్నారు. ఈ ఎంపిక ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆదేశాలు, సీనియర్ టిడిపి నాయకులు, స్థానిక టిడిపి నాయకుల సూచనల మేరకు జరిగిందన్నారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం కష్టపడిన ప్రతి ఒక్కరికి న్యాయం చేయాలన్నారు. అంతర్గత విభేదాలను పక్కనపెట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. నూతన కమిటీని, అబ్జర్వర్లను పూలమాల శాలు వాలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు బీదం గురు నాథ్ యాదవ్, జీవి నాయుడు, ఈశ్వర్ నాయుడు, నయాజ్, షరీఫ్,శంకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ శీనా, జెసిబి వేణు, గంగులు, ఖాదంబాషా, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత : డిఎల్‌పిఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

పరిసరాల పరిశుభ్రత మన అందరి బాధ్యత అని మదనపల్లి డిఎల్‌పిఒ నాగరాజు అన్నారు. శుక్రవారం ఉదయం ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాన్ని ఆకస్మికంగా అయన తనిఖీ చేశారు. ఎంపిడిఒ రమేష్ బాబు, డిప్యూటీ ఎంపిడిఒ బాలరాజుతో కలిసి నిమ్మనపల్లె, తవళం గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను శు భ్రంగా ఉంచుకోవడం ప్రజలందరికీ బాధ్యతని అన్నారు. పారిశుధ్య కార్మికులు ప్రతి పంచాయతీలోనూ రోజు ఒక పల్లెకు వెళ్లి ఇంటింటా చెత్తను సేకరించాలని అన్నారు. ప్రజలు కూడా పారిశుధ్య కార్మికులు వచ్చినప్పుడు తమ ఇంటిలోని తడి, పొడి చెత్తను చెత్త బండిలో వేయాలన్నారు. ఇంటిలోని వ్యర్థపదార్థాలను, చెత్తను ఎక్కడపడితే అక్కడ పడవేసి ఇంటి చుట్టూ, పల్లె చుట్టూ ఉన్న పరిసరాల ప్రాంతాలను అపరిశుభ్రం చేయవద్దని తెలిపారు. బస్టాండ్ ఆవరణంలో మాంసపు దుకాణదారులు, నిత్యవసర సరుకుల దుకాణదారులు కూడా చెత్తను బాధ్యతగా చెత్త బండిలో వేయాలని, రోడ్డుపై పడవేయద్దని సూచించారు. సంపద తయారీ కేంద్రాలకు చెత్తను తరలించడం వలన సులభతరంగా ఎరువును తయారుచేసి, పంచాయతీకి లాభాలను ఆర్జించవచ్చని ఆయన సూచించారు. సంపద తయారీ కేంద్రాలను కూడా సుందరవణంగా ఉంచాలన్నారు. ప్రభుత్వం గ్రామాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించిందని, అందుకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ తమ విధులను నిర్వర్తించాలని ఆదేశించారు. ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించేవారు అందుకు తగిన బాధ్యతను వహించాలని పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యంతో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వెంకటరమణ రెడ్డి, గౌతమి, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



పారిశుధ్య సిబ్బందితో మాట్లాడుతున్న డిఎల్‌పిఒ నాగరాజు



గాలివీడు : మంత్రి రాంప్రసాద్‌రెడ్డి గజమాలతో సత్కరిస్తున్న గ్రామస్తులు

సంక్షేమ పాలన చంద్రబాబుతోనే సాధ్యం

-రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-గాలివీడు

సంక్షేమ పాలన చంద్రబాబుతోనే సాధ్యమని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఎగువ గొట్టివీడు గ్రామంలో టిడిపి నాయకులు నాగమల్లు, రహంతుల్లా, మల్లికా ర్జున ల ఆహ్వానం మేరకు గ్రామంలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభు త్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన యేడాదిలోపే సూపర్ సిక్స్ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని అన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు, పింఛన్లు, తల్లికి వందనం పథకాలతో ప్రజలకు చేకూరింద న్నారు. అన్నదాత సుఖీభవ అమలుకు సిద్దమైందని అన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యం కలిస్తున్నట్లు ఆయన తెలి పారు. కార్యక్రమంలో మండల,గ్రామ టిడిపి నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు. **పీలేరు:** ప్రజా సమస్యల పరిష్కారమే సుపరిపాలన తొలి అడుగు లక్ష్యమని పీలేరు ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్య దర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పీలేరు పట్టణంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమై వారి సమస్యలు అడిగి తెలుసుకుని, పరిష్కార మార్గం చూపించడమే ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. అనంతరం జెండా మాను వీధి, కటువకాలవ వీధుల్లో ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, రాబోయే నాలుగేళ్లలో చేపట్టే పథకాలు ప్రజలకు వివరిస్తూ, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సిఎం చంద్రబాబు సారథ్యంలో సంచల నమైన సంక్షేమ పథకాలు అందిస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే రాకతో ప్రజలు వారి ముందున్న సమస్యల్ని వివరించారు. వెంటనే ఆ సమస్యలను పరిష్కరించాలని ఆయన ఉన్నతాధికారులను సూచించారు.కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు అనుబంధ సంఘాలు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు ఉచితంగా పండ్ల మొక్కలు

ప్రజాశక్తి-గాలివీడు

నీటి సౌకర్యం ఉన్న రైతులకు పండ్ల మొక్కలు ఉచితంగా అందిస్తున్నామని రీసర్చ్ పర్సన్ సాయి చరణ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ సభా భవనంలో రీడ్స్ సంస్థ ఆధ్వర్యంలో పండ్ల మొక్కలు నాటుకొని రైతులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రీడ్ సంస్థా అధ్యక్షులు ఎం.శ్రీనివాసులు మాట్లాడుతూ పండ్ల మొక్కలు నాటుకునే ముందు మొక్కలు నాటే విధానం గురించి శిక్షణ అందించారు. మొక్కలు నాటుకొని ముందు గుంతలు తీసు కొని విధానం మొక్కలు నాటుకోని విధానం గురించి వివరించారు. మొక్క లు నాటిన తర్వాత ఎలాంటి పద్ధతులు పాటించాలో వివరించారు. రిసోర్స్ పర్సన్ సాయిచరణ్, అరుణ్‌కుమార్ మాట్లాడుతూ సహకారంతో గాలివీడు, లక్కిరెడ్డిపల్లి, రామాపురం, సుండుపల్లి, రాయచోటి, చిన్నమండెం, పెద్ద మండెం, మండలంలోని నీరు సౌకర్యం ఉన్న రైతులకు పళ్ళముక్కలు ఉచి తంగా అందిస్తున్నామని ఎక్కువగా మామిడి మెయిన్ క్రాఫ్ట్ గా బార్డర్ క్రాప్ గా మహాగని ఎర్రచందనం, కొబ్బరి మొక్కలు ఇస్తున్నామని పేర్కొన్నారు



ట్రాక్టర్‌లో లోడ్ చేసిన ఇసుక

మాండవ్య నదిలో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని వీరబల్లి, రాగిమానుదిన్నెపల్లి, హరిజనవాడ, వంగిమళ్ళ, తాటిగుంటపల్లి, మట్లి, తదితర ప్రాంతాల్లో ఉండే మాండవ్య నదిలో ఇసుక అక్రమార్కులు పగలు, రాత్రి తేడా లేకుండా వందల ట్రిప్పుల ఇసుక ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో వైసిపి ప్రభుత్వంలో ఇసుక క్వారీలో ప్రభుత్వానికి పైసలు చెల్లించి ఇసుక తీసుకుని పోయేవారు. కూటమి ప్రభుత్వంలో ఉచిత ఇసుక అన్న పదాన్ని అడ్డుపెట్టుకుని, ఇసుక దొంగలు వందల ట్రిప్పులు ఇసుక అక్రమంగా, ఇతర జిల్లాలకు, ఇతర రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని ప్రజలుఆరోపిస్తున్నారు. ఇసుక తీయడం వలన తాగునీటి కొరత ఏర్పడుతుందని, బావులు, నీటి ఫిల్టర్లు ఎండి పోతాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు. రెవెన్యూ సిబ్బంది, పోలీసులు ఇసుక అక్రమ రవాణా రవాణాపై నిఘా ఉంచి ఇసుక అక్రమరవాణాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

అలరించిన బోధనాభ్యాస చిత్రాల ప్రదర్శన

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని దలవాయిపల్లి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో శు క్రవారం బోధన అభ్యసన చిత్రాల ప్రదర్శన అలరించడం జరిగిందని ఉపాధ్యా యుడు రమణ తెలి పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులు వివిధ మెట ీరియల్స్ ఉపయోగించి పాటలు బోధించడానికి అవసరమయ్యే టీచింగ్, లెర్నింగ్ మెటీరి యల్ తయారుచేసి ప్రదర్శించడం జరిగిందని పేర్కొన్నారు. బోధనాభ్యాస చిత్రాల బోధన సులభతరమే కాక విద్యా ర్థులు తొందరగా నేర్చుకొని ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటారని తెలిపారు. ఈ ప్రదర్శ నలో టీ కప్స్‌తో వేసిన వర్ణమాల, ఆల్ఫాబెట్ హౌస్, స్థాన విలువల చార్ట్, గణిత మ్యాజిక్ బోర్డు, కలర్ పేపర్స్‌తో చేసిన క్రాఫ్ట్ వర్క్ మోడల్స్ విద్యార్థులను ఎంత గానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని జింక మృతి

ప్రజాశక్తి-రామాపురం



మృతి చెందిన జింక

కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారి మండల పరిధిలోని పాలన్న గారి పల్లె సమీపంలో శుక్రవారం ఉదయం రోడ్డు దాటుతున్న జింకను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందినట్లు అటవీ శాఖ అధికారి భరణి కుమార్ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం రామాపురం పశువైద్యశాలకు తరలించి పోస్టుమార్టం అనంతరం అడవి ప్రాంతం లోకి తీసుకెళ్లిదహనం చేసినట్లు ఆయన తెలిపారు.

పాల కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి : మండల కేంద్రం లక్కిరెడ్డిపల్లె పాత ఎస్‌బిఐ బ్యాంక్ దగ్గర మదర్ పాల కేంద్రాన్ని వైసిపి హిందూ పురం ఎన్నికల పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి మండల అధ్యక్షులు సుదర్శన్ రెడ్డితో కలిసి ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ వినియో గదా రులకు నాణ్య మైన పాల ఉత్పత్తులు అందించాలని పాలకేంద్ర యజమాని మూగి శ్రీరా ము లకు సూచించారు. వ్యాపార రంగంలో వృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చాన్‌బాషాకు పరామర్శ

ప్రమాదవశాత్తు గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్, మైనార్టీ నాయకులు చాన్ బాషాను ఎంపిపి సుదర్శన్‌రెడ్డితో రమేష్‌కుమాం రెడ్డి పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకోన్నారు. కార్యక్ర మంలో ఎంపిటిసి సభ్యులు శంకర్‌నాయుడు, జగన్‌మోహన్‌రెడ్డి, సర్పంచ్‌లు వెంకటనారాయణ రెడ్డి, చెంద్రాయుడు, మాజీ సర్పంచ్ సుబ్బరాజు పాల్గొన్నారు.



విద్యార్థులకు విద్యా సామగ్రి అందిస్తున్న టిడిపి నాయకులు

విద్యాసామగ్రి వితరణ

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని కోన పంచాయితీ కోన బంగారు వాండ్లపల్లి, గంగిరెడ్డిగారిపల్లిలో ప్రాథమిక పాఠశాలల్లో అంగన్వాడీ పాఠశాలల్లో 250 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులను చేనేత కార్మిక చెంగల శివశంకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం లో కలకడ మండలం క్లస్టర్ ఇన్‌ఛార్జి బరకం శ్రీనివాసు లురెడ్డి, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీని వాసులు, స్థానిక టిడిపి నాయకులు మాజీ సర్పంచులు సిబ్బాల చంద్రమోహన్, గుదిటి త్యాగరాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ స్కూళ్లలో విద్యార్థులకు మధ్యాహ్నం నాణ్యమైన భోజనం అందించి, విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రధానోపాధ్యాయులు రెడ్డెప్ప, కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల తెలుగు రైతు అధ్యక్షులు ఎం.వి.బాబు నాయుడు, చేనేత కార్మికులు గుదిటి గురుస్వామి, బాలయ్య, హెచ్‌ఎం ఖలీల్ భాషా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బిసి వసతి గృహంలో ఎంపిడిఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని బిసి బాలుర వసతి గృహాన్ని ఎంపిడిఒ భానుప్రసాద్ అకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో ఉన్న 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 246 మంది విద్యార్థులు ఉండగా వీరిలో 226 మంది శుక్రవారం హాజరయ్యారు. ఆఫ్‌లైన్‌లో ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరును తనిఖీలు చేశారు. బోర్డింగ్ కోసం రెండు గదులు మాత్రమే అందుబాటులో ఉన్నట్లు గుర్తించి ,15 సంవత్సరాల ముందు గోడలకు వైట్ వాష్ చేయడంపై గమనించి గోడలకు వైట్ వాష్ చేయించమని ఆదేశించారు. మరుగుదొడ్లు ఎక్కువుగా ఉన్నప్పటికీ తొమ్మిది మాత్రమే అందుబాటులో ఉండడం గుర్తించి, మిగిలిన 8 టాయిలెట్లు పునరుద్ధరించాలని సూచించారు. హాస్టల్‌లోని వంటగది, స్టోర్ స్టోర్ రూమ్ గదులను పరిశీలించారు. హాస్టల్ ఆవరణంలో చెట్లు విరివిగా ఉండడం గమనించి సంతృప్తిని వ్యక్తం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన ఆహారాన్ని అందించాలని తెలిపారు. వైద్య సిబ్బంది రాకపోవడంపై గమనించి ప్రతిరోజూ వైద్య సిబ్బంది వచ్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఇఒ మునిందర్ నాయక్ వార్డెన్ సుబ్బరామయ్య పాల్గొన్నారు.



స్టోర్ రూములో బియ్యాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ భానుప్రసాద్